www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 10 అక్టోబర్ 2024
5
పశ్చిమ గోదావరి

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో 9, పదో తరగతులు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న బిసి, ఇబిసి, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు పిఎం యశస్వి పథకం ద్వారా ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిక అధికారి జివిఆర్‌కెఎస్‌ఎస్.గణపతిరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన 9, 10 తరగతుల విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు, ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించరాదని తెలిపారు. పూర్తి వివరాలకు https://scholarships.gov.in/Students వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పోటీనా.. ఏకపక్షమా..!

16 సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్
40 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తికి సన్నాహాలు
చేతులెత్తే విధానంలో ఎన్నికలపై రైతుల్లో అసంతృప్తి
గతంలో పోటీ లేకుండా.. ఏకపక్షంగా నిర్వహించారనే విమర్శలు
ఉమ్మడి 'పశ్చిమ'లో మేజర్ ఇరిగేషన్‌లో 131 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, 20 డిసిలు, ఒక ప్రాజెక్టు కమిటీ
మైనర్ ఇరిగేషన్‌లో 222 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, రెండు ప్రాజెక్టు కమిటీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తారా.. లేక ఏకపక్షంగా సాగించి ముందుగా అనుకున్నవారినే నియమిస్తారా.. అనే అనుమానాలు నెలకొన్నాయి. గతంలో మాదిరిగా కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ రైతుల్లో పెద్దఎత్తున వినిపిస్తోంది. ఈ నెల 16వ తేదీన సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 40 రోజుల్లో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు చెప్పింది. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగడం మంచి పరిణామంగా చెప్పొచ్చు. ఎన్నికల నిర్వహణ తీరుపై మాత్రం రైతుల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగిన తీరును అంతా గుర్తు చేసుకుంటున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలను మూడు పద్ధతుల్లో నిర్వహిస్తారు. వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలు మూడు విభాగాలుగా ఎన్నికల నిర్వహణ సాగుతోంది. వాటర్ యూజర్స్ అసోసియేషన్లలో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, నలుగురు సభ్యులు ఉంటారు. వీరిని ఆయకట్టు రైతులు ఎన్నుకొంటారు. ఈ కమిటీల సభ్యులు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి గోదావరి డెల్టా పరిధిలోని మేజర్ ఇరిగేషన్‌లో 131 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, 20 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 222 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, రెండు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్‌లో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు లేవు. మేజర్ ఇరిగేషన్ అంతా డెల్టా పరిధిలో ఉండగా, మైనర్ ఇరిగేషన్ అంతా మెట్ట ప్రాంతంలో ఉంది. మెట్టప్రాంతంలోని తమ్మిలేరు, ఎర్రకాలువకు రెండు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. విభజిత జిల్లాల ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతాయని చెబుతుండటంతో కమిటీల లెక్కలు మారే అవకాశం ఉంది.

ఎన్నికల నిర్వహణపై చర్చ

సాగునీటి సంఘాలకు సంబంధించి వాటర్ యూజర్స్ అసోషియేషన్ కమిటీలోని సభ్యులను ఆయకట్టు పరిధిలోని రైతులు ఎన్నుకుంటారు. ఈఎన్నికల్లో బ్యాలెట్ పద్ధతి లేకుండా చేశారు. 2015లో జరిగిన ఎన్నికల్లో గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి చేతులెత్తే విధానంలో ఎన్నికల నిర్వహించారు. అప్పట్లో పోటీ అనేది లేకుండా చేశారు.ఎక్కడైన పోటీగా అభ్యర్థి ఉంటే అక్కడ ఎన్నికలు జరపకుండా వాయిదా వేసి, అడ్డదారిలో ఎన్నికలు నిర్వహించారన్న తీవ్ర విమర్శలను అప్పట్లో ప్రభుత్వం మూటగట్టుకుంది. అధికార పార్టీ నాయకులు ముందుగా అనుకున్న సభ్యులనే సాగునీటి సంఘాల ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఆయకట్టు పరిధిలోని పైన పొలం ఉన్న రైతులను ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటే దిగువన పొలం ఉన్నవారిని వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటారు. ఒకవేళ దిగువన పొలం ఉన్నవారికి ప్రెసిడెంట్ ఇస్తే.. పైన పొలం వారికి వైస్ ప్రెసిడెంట్ ఇస్తారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని సాగునీటి సంఘాలకు అనధికారికంగా టిడిపి, జనసేన నాయకులను నియమించిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో వీరినే ప్రకటించి మమ అనిపించే అవకాశం కనిపిస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో కాకుండా, ఏకపక్షంగా నిర్వహించడం వల్ల ఉపయోగం ఏమిటనే చర్చ రైతుల్లో నడుస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని అంతా కోరుతున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎన్నికలు జరిపినా నిధులివ్వకపోతే ప్రయోజనం శూన్యం

సాగునీటి సంఘాలకు 2015లో ఎన్నికలు నిర్వహించినప్పటికీ నిధులు మాత్రం విడుదల చేయలేదు. దీంతో సాగునీటి సంఘాలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. నిబంధనల ప్రకారం రైతులు నీటి తీరువా కింద చెల్లించే సొమ్ములో 60 శాతం వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు, స్థానిక పంచాయతీలకు ఐదు శాతం, ఇతర కమిటీలకు నిధులు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నిధులతో కాలువల్లో చెత్త పంటివి తొలగించడంతోపాటు రైతులకు ఉపయోగపడే పనులను సాగునీటి సంఘాల ప్రతినిధులు చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడం వల్ల రైతులకు ఉపయోగం లేకుండాపోతోంది. ఈసారైనా సాగునీటి సంఘాలకు నిధులు విడుదల చేసి, రైతులకు మేలు చేసేలా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

ఉచిత ఇసుక వెంటనే అందించాలని ఆందోళన

ప్రజాశక్తి - ఉండి

నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు, భవన నిర్మాణ కార్మికులు

టిడిపి కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మెయిన్ సెంటర్‌లో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు నిరసన చేపట్టారు. సందర్భంగా జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ 'అన్న ఉన్నా అల్లుడి నోట్లో శని' అనే చందంగా ఇసుక పుష్కలంగా లభించే గోదావరి జిల్లాల్లో ఇసుక కొరత సుమారు లక్ష మంది భవన నిర్మాణ కార్మికులను వేధిస్తోందన్నారు. బహిరంగ మార్కెట్లో ఇసుక ధర కొండెక్కడంతో ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయని, దీంతో భవన నిర్మాణ కార్మికులు పనులేక పస్తులుంటున్నారని తెలిపారు. తక్షణం ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. గత వైసిపి పాలనలో ఐదు యూనిట్ల ఇసుక ధర సుమారు రూ.15 వేలు ఉంటే ప్రస్తుతం రూ.30 వేలు దాటిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులైనా ఉచిత ఇసుక అందించలేకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టాడ వెంకటేశ్వరరావు, కింతాడ రమేష్, ఆళ్ల గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో భారీ వర్షం

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు విపరీతమైన వేడి, ఉక్కపోతతో విలవిల్లాడిన జనం మధ్యాహ్నం వేళ ఒకసారిగా ఆకాశం మేఘావృతం కావడంతో చల్లని వాతావరణంతో సేదతీరారు. కొద్దిసేపటికే భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా గంటన్నరకుపైగా వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. భారీవర్షంతో రొయ్య రైతులు దిగాలు పడ్డారు. రొయ్య తిరగబడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. చేప పిల్లల పరిస్థితీ అదే.

పేకాట క్లబ్‌లకు అనుమతి లేదు

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - నరసాపురం

సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

జిల్లాలో ఎక్కడా పేకాట క్లబ్‌లకు అనుమతి ఇవ్వలేదని, ఎక్కడైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. బుధవారం స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పలు రికార్డులను, లాకప్ పరిశీలించారు. అనంతరం ఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పేకాట సాగకుండా లాడ్జీలు, క్లబ్‌లపై గట్టి నిఘా ఉంచామన్నారు. ఇప్పటికే పలుచోట్ల దాడులు చేస్తున్నామన్నారు. జూదాన్ని నిర్వహిస్తే ఎంతటివారినైనా విడిచిపెట్టబోమని అన్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో అనధికార ఇసుక తవ్వకాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి సమయాల్లో తవ్వకాలు జరిపితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్, వరుసగా జరుగుతున్న దొంగతనాలపై కూడా నిఘా పెట్టామన్నారు. సాధారణంగా పండుగ సమయాల్లో చోరీలు ఎక్కువగా జరుగుతాయన్నారు. ఈ చోరీలు స్థానికులే చేస్తున్నారా, లేక బయట ముఠాలు వచ్చాయా అనే దానిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. త్వరలో ఈ ముఠాలను పట్టుకుంటామని తెలిపారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పట్టణాల్లో బెట్టింగులు నిర్వహించేదెవరనే దానిపై ఆరా తీస్తున్నామన్నారు. గంజాయి సరఫరాదారులపైనా నిఘా ఉంచామన్నారు. ఇటీవల కొత్త వారితో గంజాయి సరఫరా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎక్కువగా కాలేజీ విద్యార్థులనే టార్గెట్ చేసి అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. దీన్ని నియంత్రించేందుకు విద్యార్థులకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ కంట్రోల్ చేసే డైవర్షన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్టేషన్లో నమోదవుతున్న సైబర్ మోసాల కేసుల్లో నిందితుల బ్యాంక్ ఖాతాల్లో సీజ్ చేసిన నగదును న్యాయమూర్తుల అనుమతితో బాధితులకు అప్పగించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సిఐకు ఎస్‌పి సూచించారు. పండుగ సందర్భంగా ఎవరైనా అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సిఐ యాదగిరి పాల్గొన్నారు.

మూడు ప్రాంతాల్లో రైతుబజార్లు

ఏడు నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు

సరసమైన ధరలకు ఉల్లి, టమోటా, వంటనూనె అందించేందుకు చర్యలు

జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి సరోజ

ప్రజాశక్తి - భీమవరం

బహిరంగ మార్కెట్లో టమోటా, ఉల్లిపాయలు, వంట నూనెల ధరలు అధికంగా ఉండటంతో వినియోగదారులకు సరసమైన ధరలకు వాటిని అందించేందుకు చర్యలు చేపట్టామని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ఎన్.సరోజ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో భీమవరం, పాలకొల్లు, నరసాపురం ప్రాంతాల్లో రైతుబజార్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా టమోటాలు కిలో రూ.50, ఉల్లిపాయలు కిలో కర్నూలు రకం రూ.32, మహారాష్ట్ర రకం రూ.47 చొప్పున అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. వంట నూనె బ్రాండెడ్ పామాయిల్ 850 గ్రాముల ప్యాకెట్ రూ.120, సన్‌ఫ్లవర్ 910 గ్రాముల ప్యాకెట్ రూ.128 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఒక కుటుంబానికి ఒక కిలో టమోటా మాత్రమే అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ లేక రేషన్ కార్డు వివరాలు సమర్పించి కావాల్సిన వస్తువులు పొందవచ్చునని తెలిపారు. జిల్లా ప్రజానీకం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వారోత్సవాలను ప్రారంభిస్తున్న సత్యనారాయణరాజు

తపాలా శాఖలో పలు సంక్షేమ పథకాలు

డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ రాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తపాల శాఖలో అనేక సంక్షేమ పథకాలు ఉన్నాయని, చాలా నిర్దిష్టంగా ప్రజలకు చేరువలో పథకాల అమలు జరుగుతున్నాయని భీమవరం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎన్‌వి.సత్యనారాయణరాజు అన్నారు. అతి తక్కువ వడ్డీతో డిపాజిట్ తీసుకుని లబ్ధిదారులకు లాభం చేకూరేలా విశేష స్పందనతో నడుస్తున్నాయని తెలిపారు. బుధవారం శ్రీవిజ్ఞానవేదిక, తపాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాల శాఖ వారోత్సవాలను భీమవరం హెడ్ పోస్టల్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి తపాల శాఖ అమల్లో ఉందని, ప్రభుత్వ శాఖల్లో అతి కీలకమైన శాఖ తపాల శాఖ అని, తన 33 ఏళ్ల సర్వీసులో స్వచ్ఛంద సంస్థలు ఇదేవిధంగా చేయడం గొప్ప విశేషమని అన్నారు. అసిస్టెంట్ పోస్టల్ సుపరింటెండెంట్ అల్లు సురేష్, హెడ్ పోస్ట్‌మాస్టర్ పి.రాజు, పిఆర్‌ఒ.సత్యనారాయణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధి కలిగి ఉన్నారని, పోస్టల్ సంక్షేమ పథకాలు, ఇన్సూరెన్స్‌లపై అవగాహనా కార్యక్రమాలపై అవగాహన అవసరమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకూ పోస్టల్ శాఖ సహకారంతో ఈ వారోత్సవాల్లో స్టాంపుల ప్రదర్శన, విద్యార్థులకు వివిధ పోటీలు, మొక్కలు నాటడం, పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. గెలుపొందిన వారికి ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. ఉత్తమ పోస్ట్‌మెన్‌లకు సత్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెల్లబోయిన రంగారావు, ఎస్‌కె.చాన్ భాషా, తపాలా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులకు గుర్తింపు

ఆర్‌డిఒ దాసిరాజు

పాలకొల్లు : తెలుగు రాష్ట్రాలు కూడా క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొందారని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. పాలకొల్లు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పద్మరాజు మెమోరియల్ టెన్నిస్ పోటీల ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. టెన్నిస్, చదరంగం, షటిల్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్‌లలో రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించారని చెప్పారు. గతంలో పాలకొల్లు ప్రాంతంలో పద్మరాజు ఇచ్చిన ప్రోత్సాహం వల్లే గత కొన్ని సంవత్సరాలుగా కాస్మో కాంప్లెక్స్, టౌన్ హాల్ వారు క్రీడలకు ఇచ్చిన ప్రోత్సాహాన్ని అభినందించారు. ఇలాగే మిగిలిన స్వచ్ఛంద సంస్థలు క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. అండర్ 8, 10, 12, 14 బాలురు, బాలికల సింగిల్స్, డబుల్స్ విజేతలకు బహుమతులు, కప్పులు అందించారు. సంస్థ ఉపాధ్యక్షులు ఆర్.సత్యనారాయణ రాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, రమేష్ బాబు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్‌సిలను కలిసిన పిడిఎఫ్ అభ్యర్థి

పాలకొల్లు: గోదావరి జిల్లాల పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి బుధవారం స్థానికంగా ఉన్న మాజీ ఎంఎల్‌సిలు అంగర రామ్మోహన్‌రావు, మేకా శేషుబాబులను మర్యాదపూర్వకంగా కలిశారు. వారి సహాయ సహకారాలు, మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్, నేతలు ఎస్.రాంజీకుమార్, కె.త్రినాథ్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్‌సి అంగరతో గోపీమూర్తి, నేతలు

శేషుబాబుతో గోపీమూర్తి

మద్యం షాపుల దరఖాస్తుకు గడువు పెంపు

12, 13 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 14న లాటరీ నిర్వహణ

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

విభిన్న వ్యక్తుల నుంచి అందిన వినతుల మేరకు మద్యం షాపుల కోసం నిర్దేశించిన దరఖాస్తుల సమర్పణ గడువును ప్రభుత్వం ఈనెల 11వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆన్‌లైన్‌తో సహా అన్ని విధానాలలో 11వ తేదీ రాత్రి 7 గంటలలోపు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందన్నారు. 12, 13 తేదీలలో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, 14వ తేదీ మద్యం షాపుల కోసం లాటరీ తీస్తారని తెలిపారు. అదేరోజు కేటాయింపు ప్రకియను పూర్తిచేస్తామని, అక్టోబరు 16వ తేదీ నుంచి నూతన మద్యం విధానాన్ని అనుసరించి ప్రయివేటు మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని 175 మద్యం షాపులకు బుధవారం సాయంత్రం నాటికి సుమారు 3,200 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కాబట్టి ప్రతీ దరఖాస్తుదారునికి లాటరీ నిర్వహించే ప్రదేశం, సమయం వివరాలు వారి మొబైల్‌కు ఎస్‌ఎంఎస్ ద్వారా తెలియజేయాల్సి ఉంటుందని సూచించారు. మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహణ నిబంధనల మేరకు పటిష్టవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని, దీనికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

భీమవరం టౌన్ : మద్యం షాపుల దరఖాస్తులకు ఈనెల 11వ తేదీ వరకూ ప్రభుత్వం గడువు పొడిగించినట్లు భీమవరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్‌ఎస్.కుమారేశ్వరన్ తెలిపారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం టెండర్ల షెడ్యూల్‌ను మార్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు వచ్చాయన్నారు. దసరా సెలవుల్లో బ్యాంకులు పనిచేయవని పలువురు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వారి విజ్ఞప్తితో మద్యం టెండర్ల షెడ్యూల్లో మార్పులు వచ్చాయన్నారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు. ఈ దరఖాస్తులను పెదఅమిరంలోని నిర్మల ఫంక్షన్ హాల్‌లో ఈనెల 14న ఉదయం 8 గంటల నుంచి మద్యం షాపులకు లాటరీ తీయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 175 మద్యం షాపులకు ఇప్పటి వరకు 3,200 దరఖాస్తులు వచ్చాయన్నారు. గడువు పెంపు కారణంగా దరఖాస్తులు సుమారు 4 వేలకు పైగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని దరఖాస్తుదార్లు గమనించి దరఖాస్తు చేసుకోవలసిందిగా ఆయన కోరారు.

తణుకు : మద్యం షాపులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం ఈనెల 11వ తేది శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకు పొడిగించడం జరిగిందని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ మద్యం షాపులకు సంబంధించిన లాటరీ ఈనెల 14వ తేదీన జరుగుతుందని, 16వ తేదీన షాపులు ప్రారంభమౌతాయన్నారు. తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 33 షాపులకు సాయంత్రానికి 532 దరఖాస్తులు అందాయన్నారు. అప్లికేషన్ ఫీజు రూపంలో రూ.10 కోట్ల 64 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. మద్యం షాపులకు సంబంధించి దాఖలైన దరఖాస్తు వివరాల కోసం hpfsprojects.com వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. దరఖాస్తుదారులు ఏమైనా సందేహాలు ఉంటే సమాచారం కోసం తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సెల్ 9440902436 నెంబరును సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యతివ్వాలి

జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ

నరసాపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామాలకు మంజూరయ్యే నిధులతో ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ అన్నారు. స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం డివిజన్ స్థాయిలో నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరాతో పాటు గ్రామాల్లోని ప్రజలకు శాశ్వత ప్రాతిపాదికన మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. గ్రామ కార్యదర్శులు వారు పనిచేస్తున్న గ్రామాల పట్ల, స్థానిక పరిస్థితుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధి హామీ చట్టం 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో చేపట్టే పనులకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు.

స్వయం ఉపాధి వైపు యువత చూపు

ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

ఎంఎల్‌ఎను సత్కరిస్తున్న కళాశాల అభివృద్ధి కమిటీ

సాఫ్ట్‌వేర్ రంగం సంక్షోభంలో ఉన్న ప్రస్తుత తరుణంలో యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారిస్తుందని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. బుధవారం ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో గత సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సామంతపూడి బాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ గతంలో కొన్ని ట్రేడ్లతో ప్రారంభమైన ఐటిఐ కళాశాలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి ప్రస్తుతం పలు ట్రేడ్లను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించి వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు సంస్థ ఛైర్మన్ బాలకృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరాజు చేస్తున్న కృషి అనిర్వచనీయమని అన్నారు. ఇప్పుడున్న ట్రేడ్లకు అదనంగా సెల్‌ఫోన్ మెకానిజం కోర్సును ఏర్పాటు చేస్తే మరికొంత మంది విద్యార్థులు కళాశాలలో చేరేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గత సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజును కళాశాల అభివృద్ధి కమిటీ ఘనంగా సత్కరించింది.

ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సిద్ధం కండి

ప్రజాశక్తి - పెనుగొండ

ఆచంట : మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు

ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లకు అధికారులు అన్ని విధాలా సంసిద్ధత కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులకు దిశనిర్దేశం చేశారు. బుధవారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై రెవెన్యూ, వ్యవసాయ శాఖలు, పరపతి సంఘాలు, రైస్ మిల్లర్స్‌తో మండల స్థాయిలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2024-25 రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు అధికారులు అన్ని విధాలుగా సంసిద్ధత కావాలని అన్నారు. రైతుల వద్దనుంచి ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లను ముందుగానే చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించిన గన్ని బ్యాగ్స్‌ను మిల్లర్ నుంచి ముందుగా సేకరించుకుని రైతు సేవా కేంద్రాలకి చేర్చి భద్రపరుచుకోవాలన్నారు. రైస్ మిల్లర్స్ అందరూ రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తీసుకోవాలని, వారికి ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చూడాలని రైస్ మిల్లర్స్‌కు సూచించారు. మిల్లర్లు ఎటువంటి ఆటంకాలు రైతులను పెట్టకుండా ధాన్యం తేమ పరీక్షను కరెక్టుగా నిర్వహించాలని సంబంధించిన శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.అనితాకుమారి, మండల వ్యవసాయ అధికారి పి.స్పందన, ఎంఎల్‌ఒ కె.రాధాకృష్ణ, ఎంపిడిఒ పి.సూర్యనారాయణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు దళారుల చేతుల్లో నష్టపోకుండా చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు

ఆచంట : దళారుల చేతుల్లో రైతులు నష్టపోకుండా ప్రతి రైతుకు మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు పై అగ్రికల్చర్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, డిజిటల్ ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మిల్లర్లకు ధాన్యం సరఫరా చేసే వివరాలు వెంటనే రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు. రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లర్లకు ధాన్యం సరఫరా చేసుకోవచ్చు అని ధాన్యం మిల్లర్లకు తోలిన 48 గంటల్లో రైతుల అకౌంట్లో డబ్బు జమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అడ్డాల పార్వతి, తాసిల్దార్ సయ్యద్ మౌలానా పజిల్, మంగాకుమారి, మండల వ్యవసాయ అధికారి జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండల విస్తరణాధికారిగా వెంకటరెడ్డి

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండల నూతన విస్తరణాధికారిగా సిహెచ్.వెంకటరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గతంలో మండల విస్తరణాధికారిగా పాలకోడేరు, పెనుగొండ మండలాల్లో పనిచేశానని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజల సహకారంతో మండలాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. అనంతరం ఆయనకు ఎంపిడిఒ ఎస్.రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

లంక గ్రామాల్లో ఉపాధి పనులు చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్

ఆచంట : లంక గ్రామాల్లో ప్రజలకు పనులు లేక ఆర్థికంగా అలమటిస్తూ కాలం గడుపుతున్నారని, తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఉపాధి హామీ పనులు చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. అయోధ్య లంకలో బుధవారం సిపిఎం శాఖ మహాసభ సరెళ్ల రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను దాసరి రమేష్ ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణరాజు, వలవల శ్రీరామ్మూర్తి చిత్రపటాలకు పూలమాల లేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శాఖ కార్యదర్శిగా మట్టపర్తి ఆంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గూనపాటి వెంకటేశ్వరరావు, దాసరి బాలయ్య, సిద్ధార్థ పాల్గొన్నారు.

నీలిజెండాను రెపరెపలాడించిన వ్యక్తి కాన్షీరామ్

తణుకు : నీలి జెండాను ఉవ్వెత్తున ఎగిరేలా రెపరెపలాడించిన రాజకీయ యోధుడు మాన్యశ్రీ కాన్షీరామ్ అని ఆల్ ఇండియా పూలే అంబేద్కర్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు, న్యాయవాది పొట్ల సురేష్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆల్ ఇండియా పూలే అంబేద్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాన్షీరామ్ 16వ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాంసెఫ్ నాయకులు గంజి మధు మాట్లాడుతూ కాన్షీరామ్ తన 31వ సంవత్సరంలోనే అంబేద్కర్ రచించిన కుల నిర్మూలన గ్రంథం ద్వారా ప్రేరేపితుడయ్యాడన్నారు. తన తల్లికి ముప్పై పేజీల ఉత్తరం రాస్తూ ఇక నుంచి నేను కుటుంబ బాంధవ్యాలను తెంచుకుంటున్నాను, నాకోసం మీరు వెతకవద్దు అంటూ బయటికి వెళ్లి చనిపోయే వరకు తిరిగి ఇంటికి వెళ్లలేదని కొనియాడారు. ఫౌండేషన్ నాయకులు విప్పర్తి రాజశేఖర్ మాట్లాడుతూ అణచివేతకు గురైన జాతుల్ని అధికార పీఠమెక్కించిన అంబేద్కర్ వారసుడు కాన్షీరామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.నాగబాబు, గాంధీ, రవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ

ఉండి : ధాన్యం కొనుగోలు సిబ్బంది అన్ని ప్రమాణాలు పాటిస్తూ కచ్చితత్వంతో, పారదర్శకతతో ధాన్యం కొనుగోలు చేయాలని ఉండి తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన మూడో విడత శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జున మాట్లాడుతూ రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వం నుంచి రైతులకు అందాల్సిన ప్రతి సంక్షేమ పథకాన్ని రైతులకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఖరీఫ్ 2024కు సంబంధించి నవంబర్ మూడో వారంలో ధాన్యం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందని, ప్రతిఒక్కరూ శిక్షణలో నేర్చుకున్న విధంగా అన్ని ప్రమాణాలు పాటించాలని, రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తూ, ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. ఆకివీడు వ్యవసాయ సహాయకులు కెవిఎస్-ఎస్.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి బి.రంధ్య, పౌరసరఫరాల శాఖ ఉండి మండల డిప్యూటీ తహశీల్దార్ ఎం.మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట : రైతులు పండించిన పంటను నచ్చిన మిల్లర్లకు అమ్ముకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తహశీల్దార్ ఎ.సోమేశ్వరరావు అన్నారు. బుధవారం సార్వ ధాన్యం కొనుగోలుపై మూడవ దశ మండల స్థాయి శిక్షణ కార్యక్రమం సోమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సివిల్ సప్లై భీమవరం వారి కార్యాలయం నుంచి సాంకేతిక నిపుణులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,300లకు పెంచడం జరిగిందని తెలిపారు. కోఆపరేటివ్ సీనియర్ అధికారి ఇస్మాయిల్, రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జిలు, సహకార సంఘాల కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని రైతు సేవాకేంద్రాల ద్వారా కొనుగోలు చేసే ఖరీఫ్ సీజన్ ధాన్యానికి మద్దతు ధర అందుతుందని తహశీల్దార్ వై.రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండలంలోని బ్రాహ్మణ చెరువులోని మండల పరిషత్ మీటింగ్ హాలులో ధాన్యం కొనుగోలుపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన రైతు సేవా కేంద్రాలలో ఉన్నటువంటి వ్యవసాయ సహాయకులు, టిఎ, డిఎలు, హెల్పర్లకు, రైస్‌మిల్లర్స్ ప్రతినిధులకు కస్టోడియన్ ఆఫీసర్లు, సిఐఎలకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణ నిమిత్తం నియమించేటటువంటి సిబ్బంది అందరూ కూడా ఈ శిక్షణ తరగతులు పూర్తిగా శిక్షణ తీసుకుని ధాన్యం కొనుగోలులో ఏవిధమైన ఇబ్బందులూ లేకుండా చూడాలని అన్నారు. ఈ సీజన్‌లో వరిపంట మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్ ఎ రకానికి రూ.2,320, సాధారణ కామన్ రకానికి రూ.2,300లుగా ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు. పౌరసరఫరాల శాఖ నుంచి వచ్చినటువంటి మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇవ్వడం జరిగింది. మండల వ్యవసాయ అధికారిణి ఎ.జోషీలా, సత్యనారాయణ, దుర్గా భవాని, మండలంలోని వివిధ గ్రామాల్లోని వ్యవసాయ శాఖ ఉద్యోగులు, విఎఎలు, విఆర్‌ఒలు, రైస్‌మిల్లర్స్, వ్యవసాయ సహకార పరపతి సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ప్రమాదవశాత్తూ భవానీమాలధారుడు మృతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

కాలువలో స్నానానికి దిగిన భవానీ మాలధారుడు ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతిచెందిన ఘటన తణుకు మండలం తేతలి గ్రామంలో చోటుచేసుకుంది. తణుకు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన కాజా దుర్గాప్రసాద్(23) భవననిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. దసరా ఉత్సవాల నేపథ్యంలో భవానీమాల ధరించాడు. మంగళవారం రాత్రి తోటి భవానీలతో కలిసి స్నానం ఆచరించేందుకు తేతలి పరిధిలో ప్రవహిస్తున్న అత్తిలి కాలువలో దిగగా నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. మంగళవారం రాత్రి నుంచి గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం దుర్గాప్రసాద్ మృతదేహం లభించింది. దుర్గాప్రసాద్‌కి మూడు నెలల క్రితం వివాహమైంది. తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి - ఉండి

మహిళ అదృశ్యంపై కేసు నమోదైన సంఘటన ఉండిలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామానికి చెందిన నిడిపూడి సుమిద దసరా సెలవుల నిమిత్తం ఉండిలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. మంగళవారం రాత్రి 10 గంటలకు పడుకున్న సుమిద రాత్రి 12 గంటల సమయంలో తండ్రి సుందరరావు చూసేసరికి లేదు. ఇంటి చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో బుధవారం సుమిద తండ్రి సుందరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నారి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాతళ్ల మెరక గ్రామంలో మగశిశువు మృతదేహం కలకలం రేపింది. బుధవారం దీపాటి వజ్రమ్మ ఇంటి ఆవరణలో నెలలు నిండకుండా జన్మించిన మగశిశువు మృతదేహం ఉండడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కాళ్ల పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

లారీ ఢీకొని సైక్లిస్ట్ మృతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలో 216 జాతీయ రహదారిపై సూర్య కళాశాల వద్ద లారీ ఢీకొని సైకిలిస్ట్ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం శ్రీహరిపేటకు చెందిన సిహెచ్.దుర్గా ప్రసాద్ మార్కెట్ నుంచి ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో దుర్గాప్రసాద్ తలకు గాయం అయ్యింది. స్థానికులు సూర్యాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి న్యాయం చేయాలని బంధువులు, కుటుంబసభ్యులు జాతీయ రహదారిపై బస్టాండ్ సమీపంలో ధర్నా చేశారు. మృతుడి కుటుంబాన్ని న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు విరమించారు. టౌన్ సిఐ యాదగిరి, ఎస్ఐ జయలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పందెం పుంజును ఈత కొట్టిస్తూ..!

పోలవరం కాల్వలో నీటమునిగి తండ్రి, ఇద్దరు కుమారులు దుర్మరణం

తండ్రీ కొడుకుల మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్, దెందులూరు

కోడిపుంజుకు ఈత శిక్షణ ముగ్గురి ప్రాణాలను బలి తీసుకుంది. పందేనికి సిద్ధం చేసే శిక్షణలో భాగంగా కోడి పుంజును నీటిలో ఈత కొట్టించడానికి ఇంటి పక్కనే ఉన్న పోలవరం కాలువలోకి దిగిన అన్నదమ్ములు ప్రమాదవశాత్తు నీట మునగ్గా, వారిని కాపాడబోయిన తండ్రి కూడా అదే కాలువలో పడి మృతి చెందాడు. దీనికి సంబంధించి పెదవేగి సిఐ కె.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం కవ్వగుంట తోటల్లో శెట్టిపల్లి వెంకటేశ్వరరావు తన భార్య దేవి, ఇద్దరు కుమారులు మణికంఠ, సాయికుమార్‌తో కలిసి ఇల్లు నిర్మించుకుని జీవిస్తున్నాడు. వెంకటేశ్వరరావు కోడిపుంజుల పెంపకం చేస్తుంటాడు. పుంజులను పెంచి పందేల సమయంలో విక్రయిస్తుంటాడు. దీనిలో భాగంగా వెంకటేశ్వరరావు కుమారులు మణికంఠ, సాయికుమార్ బుధవారం ఉదయం కోడిపుంజులను పక్కనే ఉన్న పోలవరం కాలువలోకి తీసుకెళ్లి ఈత కొట్టిస్తున్నారు. తమ్ముడు సాయికుమార్ తాడు పట్టుకుని కాల్వ ఒడ్డున ఉండగా, అన్న మణికంఠ ఒక చేత్తో తాడును,

సాయికుమార్ మృతదేహాన్ని వెలికితీస్తున్న సిబ్బంది

మరో చేత్తో కోడిపుంజును పట్టుకుని కాలువలోకి దిగి కోడిపుంజును ఈత కొట్టిస్తున్నాడు. ఈ క్రమంలో మణికంఠ కాలువలో పడిపోగా గట్టుపై ఉన్న సాయికుమార్ కాలువలోకి దిగి అన్నను లాగే ప్రయత్నం చేశాడు. ఈ ఘటనలో ఇరువురు నీట మునిగారు. ఇది గమనించిన తండ్రి వెంకటేశ్వరరావు కాలువలోకి దిగి కుమారులను రక్షించే ప్రయత్నంలో నీట మునిగాడు. అప్పుడే అటుగా వచ్చిన వెంకటేశ్వరరావు భార్య దేవి నీటిలో మునుగుతూ తేలుతున్న భర్త, కుమారులను గమనించి కేకలు వేయడంతో సమీపంలో పొలాల్లో ఉన్న రైతులు వచ్చి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. అతి కష్టంపై వెంకటే శ్వరరావు (45), పెద్ద కుమారుడు మణికంఠ (15)ను కాల్వలో నుంచి ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికే ఆ ఇద్దరు మృతి చెందారు. సాయికుమార్ గలంతయ్యాడు. ఏలూరు అగ్నిమాపక సిబ్బంది కాలువలో గాలించి సాయికుమార్ మృతదేహాన్ని వెలికితీశారు. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. పెదవేగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు కూటమి కసరత్తు

ఉమ్మడి పశ్చిమగోదావరి కూటమి నేతల సమావేశం
అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్ వైపు మొగ్గు
పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి
మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరు సిటీ

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలపై టిడిపి కూటమి కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా బుధవారం ఏలూరులోని ఓ హోటల్లో కూటమి నేతలంతా సమావేశమై చర్చలు జరిపారు. ముఖ్యఅతిథిగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థిగా తూర్పు గోదావరి జిల్లా కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన పేరాబత్తుల రాజశేఖర్ వైపు నేతలు మొగ్గు చూపినట్లు తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన అధిష్టానం నుంచి రావాల్సి ఉందని నేతలు చెబుతున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకునేలా పని చేయాలన్నారు. ఓటు హక్కు ఎలా నమోదు చేయించుకోవాలి, కూటమి

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

నేతలు ఎలా కలిసి పని చేయాలి, ఎన్నికలకు ఎలా సిద్ధం కావాలి అనేదానిపై చర్చించుకున్నామన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ఉండబట్టే వరదల సమయంలో ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. యువత ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకునేలా కూటమి నేతలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఎంఎల్ఎలు, నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పేరుపాలెం నార్త్‌లో అన్నసమారాధన

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం నార్త్‌లో రజకుల వారి వీధిలో బుధవారం అన్న సమారాధన చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గత 12 సంవత్సరాలుగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సముద్రం నుంచి 108 కలశాలతో జలాలను తీసుకువచ్చి అభిషేకాలు చేశారు. అమ్మవారికి సరస్వతి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, సామూహిక కుంకుమ పూజలు చేశారు. గ్రామానికి చెందిన పేరుపాలెం సాయిబాబు నాగలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు ఏలూరు జిల్లాలో నీతిఅయోగ్ బృందం పర్యటన

ఏలూరు: నీతి అయోగ్ బృందం గురువారం జిల్లాలో పర్యటించనుంది. ఉదయం 11.30 గంటలకు ఏలూరు రూరల్ మండలం వెంకటాపురంలో పర్యటిస్తారు. రైతులతో మాట్లాడతారు. ఒంటి గంట నుంచి రెండు గంటల మధ్య స్వయం సహాయక బృందాలతో మాట్లాడుతారు. భోజన విరామం అనంతరం జిల్లాలో పంట, పైరు, ఫలసాయం పంటలు మరియు సాంప్రదాయాల పంటల స్థితిస్థాపకత ఛాయాచిత్ర ప్రదర్శన, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ, జిఐజెడ్ తో కేర్ పరిశోధనా ప్రాజెక్ట్ ద్వారా ఇప్పటి వరకు సాధించిన లక్ష్యాలు, ఫలితాలపై వట్లూరు టిటిడిసిలో మధ్యాహ్నం 3.15 గంటల నుంచి 4.30 గంటల వరకు రైతులతో పరస్పర చర్చా కార్యక్రమంలో పాల్గొంటారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి - నరసాపురం

మీరా స్మారక గ్రంథాలయం, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ గోపిచంద్, వైఎన్ కాలేజ్ మాజీ ప్రిన్సిపల్ పొన్నాడ సుబ్రహ్మణ్యం కొనియాడారు. స్థానిక మీరా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపిచంద్, సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ గ్రంథాలయ విజ్ఞాన కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విధంగా బుక్స్, రీడింగ్ హాల్‌తో పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభించడం గ్రంథాలయ నిర్వహణ కమిటీ మంచి సేవా దక్పథంతో దాతల సహకారంతో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. నిత్యం ఈ గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మంచి సేవా కార్యక్రమాల వల్ల విద్యార్థులకు విజ్ఞానాన్ని, మహిళలకు ఉపాధి అవకాశాల్ని అందిస్తూ..

శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గోపిచంద్, సుబ్రహ్మణ్యం

కంప్యూటర్ నైపుణ్య శిక్షణ అందజేయటం మంచి పరిణామం అన్నారు. ఇలాంటి మంచి సేవా కార్యక్రమాలకు స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజ్ నుంచి సహకారం అందిస్తామన్నారు. అనంతరం గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఈ గ్రంథాలయం ప్రారంభం నుంచే విజ్ఞానాన్ని అందిస్తూ బుక్స్‌ని అందుబాటులో ఉంచామన్నారు. దీనిని మరింత అభివృద్ధి చేసి విజ్ఞాన సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. నిత్యం జాతీయ నాయకులు, మహనీయుల వర్ధంతులు, జయంతులు కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థి, యువకుల్లో దేశభక్తి భావాలను పెంపొందిస్తున్నామన్నారు. సంక్రాంతి, ఉగాది సందర్భంగా సాంస్కృతిక క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని గతంలో ప్రారంభించామన్నారు. ప్రస్తుతం స్వర్ణాంధ్ర విద్యాసంస్థల సౌజన్యంతో ఉచిత కంప్యూటర్ శిక్షణను ప్రారంభించామన్నారు. విజ్ఞాన కేంద్రం నిర్వహణకు పొన్నాడ సుబ్రహ్మణ్యం, పద్మావతి ఆర్థిక సహకారాన్ని, విలువైన బుక్స్‌ని అందజేశారన్నారు. ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణకు టీచర్‌గా ఉమెన్స్ కాలేజ్ అధ్యాపకులు గుత్తుల సాగర్ శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కుట్టు శిక్షణా టీచర్ ఝాన్సీ, విజ్ఞాన కేంద్ర నిర్వహణ కమిటీ సభ్యులు కవురు నరసింహస్వామి, నోముల కొండ, తెలగంశెట్టి సత్యనారాయణ, గుబ్బల చిన్ని, పొగాకు నారాయణరావు, కడలి రవి, గుబ్బల వెంకటేశ్వరరావు, ఎండి జాన్, సిర్రా నానిబాబు పాల్గొన్నారు.

కందరవల్లిలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

ఆచంట : దళితపేటలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తక్షణమే ప్రభుత్వం డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్ల రాజేష్ అన్నారు. ఆచంట మండలం, కందరవల్లి గ్రామ పెదపేటలో దళిత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత పేటలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ప్రతి దళిత పేటలో డ్రెయినేజీలు అభివృద్ధి చేయాలన్నారు. అదేవిధంగా ఎస్‌సి కమ్యూనిటీ భవనములు అభివృద్ధి చేయాలని, మరీముఖ్యంగా ఉన్నతాధికారులు కలగజేసుకొని కందరవల్లి పెదపేటలో ఉన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు సరెళ్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి పాలపర్తి కృపానాధ్, నల్లి జయరాజ్, మండల అధ్యక్షులు రావి నాగరాజు పాల్గొన్నారు.

బ్రాహ్మణ చెర్వులో 'పొలం పిలుస్తోంది'

పెనుమంట్ర : మండలకేంద్రం పెనుమంట్ర, భట్లమగటూరు గ్రామాలలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ఎ.జోషిలా మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో ఎంటియు-1318 రకంలో ఎక్కువగా బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు గుర్తించడం జరిగిందని, అయితే ఈ తెగులు చిరుజల్లులు పడటం వల్ల ఒక చేను నుంచి వేరొక చేనుకి ఈ వ్యాధి వ్యాప్తి జరుగుతుందని అన్నారు. అందుచేత వీలైతే తెగులు సోకిన పొలం నుంచి నీటిని మురుగుబోదుల ద్వారా బయటికి పంపాలే తప్ప చేను నుంచి చేను ద్వారా నీటిని పంపే విధంగా చూడకూడదని, ఈ విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

సంక్రాంతిలోగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు

ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

సంక్రాంతిలోగా ప్రతి గ్రామంలో మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నానని ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, పంచాయతీ నూతన భవనం, రూ.23 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు బుధవారం ప్రారంభోత్సవం చేశారు. మంచినీటి చెరువుల వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసుకోవాలని ఎంఎల్ఎ గ్రామ ప్రజలకు సూచించారు. అనంతరం కీర్తిశేషులు పెనుమత్స సత్యనారాయణ రాజు 4వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వృద్ధులకు దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, సర్పంచి సాదు శ్రీదేవి శ్రీనివాస్, ఉప సర్పంచి ప్రదీప్ రాజు, గ్రామ కార్యదర్శి డి.సునీల్ రాజు, టిడిపి నాయకులు అడ్డాల శివరామరాజు, మంతెన పెద నరసింహారాజు, అడ్డాల నాగరాజు, డాక్టర్ నీలాద్రి రాజు, డాక్టర్ దాట్ల వెంకట రామరాజు, డిఎంహెచ్ఒ ఉమామహేశ్వరరావు,

గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

తహశీల్దార్ సుందర్ సింగ్, ఎంపిడిఒ స్వాతి, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.

అంబేద్కర్ అంటే ఎనలేని గౌరవం..

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అభిమానిగా ఆయనకు ఎనలేని గౌరవం ఇచ్చే వ్యక్తినని ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్లకూరు దళిత ప్రాంతంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అంటే తనకు అత్యంత గౌరవమని, ఇటీవల కొందరు వ్యక్తులు జరగని సంఘటనను జరిగినదిగా చిత్రీకరించారన్నారు. దేవాలయానికి అడ్డుగా ఉన్న ఫ్లెక్సీని దేవాలయ ప్రవేశానికి నిమిత్తం పక్కకి పెట్టడం జరిగిందని తెలియజేశారు.

గ్రామాభివృద్ధికి కృషిచేయాలి

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వ నిధులతో గ్రామాలాభివృద్ధికి సర్పంచులు, ఉపసర్పంచులు కృషిచేయాలని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి అన్నారు. రెండురోజుల పాటు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు జరిగిన శిక్షణా తరగతులు బుధవారం మగిసాయి. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గ్రామాలాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధి అని తెలిపారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు అందజేశారు. ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ, సరిపల్లి కార్యదర్శి డి.రామాంజనేయులు, మూడవ సచివాలయ కార్యదర్శి ఎ.భాస్కర్, మండలంలోని కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఉండి : పంచాయతి కనీస పరిపాలనపై స్థానిక ఎంపిడిఒ ఎస్.రవీంద్ర అధ్యక్షతన వెలుగు కార్యాలయంలో బుధవారం ఉప సర్పంచి, వార్డు మెంబర్లకు శిక్షణా తరగతులు రెండో రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపిడిఒ రవీంద్ర మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, పరిపాలన నిర్వహణలో సర్పంచికు మాత్రమే కాకుండా వార్డు మెంబర్లకు కూడా అధికారం ఉంటుందన్నారు. ప్రతినెలా కూడా పంచాయతీ కార్యాలయంలో సర్పంచి అధ్యక్షతన వార్డు మెంబర్లతో కలిసి గ్రామసభ నిర్వహించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, వీధి దీపాలు, విద్యుత్ బకాయిల చెల్లింపు తదితర ఆర్థిక వ్యవహారాలపై చర్చించే అధికారం ఉంటుందన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలుపై కూడా చర్చించే అధికారం ఉంటుందన్నారు. నిర్బంధ విద్య, ఆస్తుల పరిరక్షణ, పంచాయతీకి ఆదాయం సమకూర్చే వనరులపై, భవన నిర్మాణ అనుమతులపై చర్చించి గ్రామాన్ని అభివృద్ధి పరచుకోవాలన్నారు. మండల విస్తరణాధికారి సిహెచ్.వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వైస్ సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మొగల్తూరు : గ్రామపంచాయతీలోని వనరులను సద్వినియోగం చేసి ఆర్థిక ప్రగతి సాధించేలా కృషిచేయాలని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని సూచించారు. మొగల్తూరులోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో రెండవ రోజు బుధవారం నిర్వహించిన పంచాయతీ ఉప సర్పంచ్లకు, వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ పాలనపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం, ఆర్థిక వనరుల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, టిఒటి.రాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర : పెనుమంట్ర సమావేశం మందిరంలో రెండో రోజు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక కింద శిక్షణా కార్యక్రమం స్వల్ప హాజరుతో జరిగింది. మొత్తం మండలంలో 18 గ్రామాలకు చెందిన 18 మంది గ్రామ పంచాయతీ, ఉప సర్పంచులకు ఐదుగురు, పంచాయతీకి ఇద్దరు చొప్పున వార్డ్ మెంబర్స్ 36 మంది స్థానంలో 22 మంది హాజరు అయ్యారు. మంగళవారం తొలిరోజు శిక్షణలో పాల్గొన్న ఉప సర్పంచి, వార్డుమెంబర్స్ చివరి రోజు శిక్షణకు గైర్హాజరయ్యారు. మండల ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బివిఎస్‌వి.శర్మ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణలో మాస్టర్ ట్రెయినీలు గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం చేపట్టవలసిన పలు కార్యక్రమాల గురించి వివరించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండూ కూటమి లక్ష్యాలు

మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని

పెనుమంట్ర : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ కూటమి లక్ష్యాలని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం పెనుమంట్ర మండలంలోని కొయ్యేటిపాడు గ్రామంలో 100 రోజుల పాలన వేడుకలలో భాగంగా సమస్యలపై ప్రజలను సందర్శించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి నెరవేరుస్తామని, రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతుందన్నారు. మాజీ జెడ్‌పిటిసి సత్తిసాయి ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎంపిటిసి ఈశ్వర్ రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు సత్తి భావిరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉండి: మండలంలోని మహదేవపట్నం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1993-94 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించి పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వారు బాల్య స్మృతులను నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆలింగణం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ సరస్వతి దేవి పూజ చేసుకునే రోజున సరస్వతీ దేవి విగ్రహాన్ని పాఠశాలకు బహూకరించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా ప్రతి ఒక్కరూ తాము చదువుకున్న పాఠశాలకు ఏదో ఒక రూపంలో సహకరిస్తే పాఠశాలల అభివృద్ధి జరుగుతుందన్నారు.

మహిళా శాఖ కార్యదర్శిగా జయశ్రీ ఎన్నిక

యలమంచిలి : మండలంలోని చించినాడ గ్రామ సిపిఎం 7వ మహిళా శాఖ కార్యదర్శిగా ముస్కాడి జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక అరుంధతి పేట కమ్యూనిటీ హాల్‌లో 7వ శాఖా మహాసభ జయశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభ సూచికగా స్థానిక స్థూపంపై జెండాను సీనియర్ నేత తెన్నేటి లక్ష్మి ఆవిష్కరించగా, ఇటీవల మృతిచెందిన నాయకులకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టి నివాళులర్పించారు. అనంతరం నూతన కార్యదర్శిగా ముస్కాడి జయశ్రీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభ పరిశీలకులుగా పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిపిఎం సీనియర్ నేత దేవ సుధాకర్‌లు వ్యవహరించారు.

150 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

తణుకు : రోటరీ ఒక సేవా సంస్థ అని, మనిషి పుట్టిన దగ్గర నుంచి మట్టిగా మారే వరకూ మేము సమాజానికి సేవ చేస్తామని రోటరీ క్లబ్ కార్యదర్శి కతారి సిద్ధార్థ అన్నారు. బుధవారం రోటరీ క్లబ్‌లో మల్లిన అరుణసారధి పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో డివైన్ ఐ ఫౌండేషన్ పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి, వేమగిరి వారి సాంకేతిక సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కరీమ్ షేక్ వైద్య సహాయం అందించగా, ప్రాజెక్టు మేనేజర్ చంటిబాబు ఆపరేషన్ అవసరమైన వారికి సలహాలు ఇచ్చారు. మొత్తం 150 మందిని పరీక్షించగా అందులో 15 మంది కి ఆపరేషన్‌కు వేమగిరి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మొత్తం 150 మందికి ఉచితంగా అవసరమైన మందులు అందించారు. అక్కిన కాశీవిశ్వనాథం, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, మేడికొండ వెంకటేశ్వరరావు, కెటివి రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

భీమవరం టౌన్: ఇండో-యూరోపియన్ సమన్వయం, ఆటోమోటివ్ స్కిల్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్త సహకారంతో, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ జర్మన్ విశ్వవిద్యాలయాలతో కలసి సహకార కార్యక్రమాలలో ప్రగతిశీల అడుగులు వేస్తోంది. కళాశాలలో ఈ సంస్థ ప్రారంభ కార్యక్రమం సర్టిఫికేషన్ పంపిణీ వర్చువల్ ఈవెంట్‌లో పాల్గొంది. ఈ ఈవెంట్‌లో ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కె.నిషాంత్ వర్మ, ఆటోమోటివ్ స్కిల్ డెవలప్మెంట్ కౌన్సిల్ సిఇఒ అరిందం లాహిరి, స్టీన్‌బిస్ డైరెక్టర్, జర్మనీ నుంచి ప్రొఫెసర్ డాక్టర్ ఇంగ్ బెర్ట్రామ్ లోహ్ముల్లర్, ఐఇఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.బంగారరాజు, జర్మన్ వర్సిటీ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ అధ్యక్షులు శ్రీరాజ్ వంగపండు, ఎస్ఆర్‌కెఆర్ కాలేజీ నుంచి జర్మన్ వర్సిటీ సహకారాల ప్రత్యేక ప్రతినిధి ప్రొఫెసర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐ అప్లికేషన్స్ నానో మాస్టర్స్ కోర్సును విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులకు ప్రశంసల మధ్య సర్టిఫికెట్‌లు అందజేశారు. అనంతరం జర్మన్ ఎక్సలెన్స్ ఇనిషియేటివ్, నానో మాస్టర్ ప్రోగ్రాం, 101 మాస్టర్స్ ప్రోగ్రాం, జర్మనీలో ఒక సెమిస్టర్ చదువుకునే అవకాశాలు వంటి కొత్త కార్యక్రమాలను హైలైట్ చేశారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఈ సహకార కార్యక్రమాల ద్వారా జర్మనీలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను అందుకోవటానికి ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుకు సంబంధించిన వారందరికి నా క్లయింట్ **సిఏజి ఇండస్ట్రీస్,** ప్లాట్‌నెం.ఎ1, తణుకు మండలం, ప.గో.జిల్లా, ఆం.ప్ర. వారి సూచనలు క్రింద తెలియజేయునది ఏమనగా.

డిస్‌సొల్యూషన్ డీడ్ **తేది.30.09.2024** ప్రకారం పరస్పర సమ్మతి ద్వారా దీని భాగస్వాములను అందరిని అనగా **1) యన్నమని బుల్లి శ్రీనివాస్, యన్నమని సరోజ రాణి** రద్దు చేసారు మరియు **యన్నమని బుల్లి శ్రీనివాస్ ది.30.09.2024 కు** ముందు సదరు రద్దు చేయబడిన భాగస్వామ్య సంస్థ సిఏజి ఇండస్ట్రీస్ యొక్క మూసివేసిన వ్యాపారానికి అవసరమైన చర్యలన్నింటికి చేయడానికి మరియు వ్యవహారాలు చేయుటకు అధికారం కలిగి యున్నారు. అందువలన ఈ బహిరంగ ప్రకటన ఇవ్వడమైనది.

తణుకు
తేది : 30.09.2024
జంగం వెంకటేశ్వర రావు
అడ్వకేట్, తణుకు